# ఏకైక మార్గం

(ప్రభు అచ్యుతుల తత్త్వ ప్రసంగం)

సంగ్రాహకులు:

**స్వామి జయతీర్థులు**

ఆంధ్రఅనువాదము:

**నేమకల్లు రామన్నగారు**

ముక్తిసాధనకు ముత్తెముల వంటి మూడే మాటలు

"కూర్చుండుము- చేయుము- చూడుము"

(కూడు-మాడు-నోడు)

-"అచ్యుతవాణి"

ప్రకాశకులు:

ప్రసారంగ సమితి,

**శ్రీ అచ్యుతాశ్రమము,**

ఉరవకొండ-515812

# "సత్య మేవ జయతే"

చూచుట కంటె - చేయుట మేలు !

చెప్పుట కంటే - వర్తించుట మేలు !

చదువుట కంటె - ఊదుట మేలు !

" మనుష్యుల మధ్య మనుష్యులైవచ్చి, మనుష్యులుగా వ్యవహరించి జనుల లోపదోషములు తెలియబరచి మార్గదర్శకులై పూర్ణత నరయుటకు వలయు మానవ పూర్ణత పొందుట కగత్యమైన సాధనా మార్గమున సాగునట్లు జనతా కల్యాణమునకై శ్రమించిన అనేక మహాపురుషుల గురించి మనము చదువుచున్నాము. కాని ప్రభువుల వైశిష్ట్యమేవేరు"

తాను పూర్ణుడయ్యు, సర్వశక్తుడయ్యు తన గొప్పతనం ప్రదర్శించి కామ్యముల కుపయోగింపక 'తన్మూలకముగా జనులను భయాశ్చర్యసమ్మూఢుల చేయక, ఇశ్వరార్పణ బుద్ధితో ధర్మకర్మ బద్ధముగ జీవన మెట్లు సాగింపవలెనో ఆదర్శముగ అనుభవనీయముగ చూపెట్టి జీవన మాయనది.

1904లో కొడగుదేశమునందవతరించి 1938 నుండి 1940 వరకు హంపియందలి 'రత్నకూట' గుహలో ఏకాంతవాస మొనర్చిన పిమ్మట చాలాకాలం వైద్యులుగ, కృషీవలులుగ ప్రజలలో వ్యాప్తినొంది సామాన్య మానవునివలె నటించు చున్నను ఆ 'పూర్ణతా ప్రతిభ' తత్త్వాకాంక్షుల సహజముగ తన వైపు ఆకర్షించి తత్త్వసాధనమే గాక తన పూర్ణత్వము నెఱుంగుటకు కూడా అనువు కలిగించినది. ఆరీతి కృపాపాత్రులై ధన్యులై ఆనందించిన అనేకుల ప్రార్థనతో 'విశ్వమునకు తత్త్వ ప్రసరణా కేంద్రముగ' ప్రభువులు హంపి ప్రాంతమున (1949లో) 'ఋష్యమూకాశ్రమము'ను స్థాపించిరి.

కృషి కర్మ మొదలు కళా ప్రావీణ్యత వరకు సామాజిక నీతినియమముల నుండి బ్రహ్మత్వము వరకు మానవుడు పురుష ప్రయత్నము ఎట్లు సాధింపవలెనో ఏల ఆరీతిగా అనన్యభక్తితో 'జ్ఞానోత్తరకర్మ'ను చేయవలెనో అను అంశమును తెలియబరచి, ప్రత్యక్షంగా శిష్యులకు శిక్షణ మిచ్చినవారు. జగత్తునందలి యే విషయము కాని, కృతిగాని వారికి తెలియక అసాధ్యమై ఉండుట లేదని ఆ యాశ్రమములో ప్రభుసన్నధిలో కొంతకాలము నివసించు అవకాశము కలిగిన వారందరికి అనుభవమే.

ఆచరణ శూన్యమైన మాటలు వారికి రుచింపవు. నిజముగా తత్త్వాకాంక్ష కలిగి తమ వద్దకే తెంచిన వారిని సాధనా జీవులుగా నొనరించిరి. బుద్ధిశక్తితో గాని, ఊహాపోహలతోకాని తత్త్వము నెఱుంగుట అసాధ్యమని దానిని గురించి గ్రంథ రచనలతో, ఉపన్యాసములతో, కేవలము మాటలతో ప్రచార మొనరించు కార్యములను వారు మెచ్చరైరి, చెయరైరి. కాని నిజమైన జిజ్ఞాసువునకు 'సత్యమార్గమేది' యను నిర్ధారణ కలుగుటకై జ్ఞానుల పలుకులు అగత్యము కాన వారి బోధనల సారాంశము సదా లభించునట్లు ఒక గ్రంథం వెలువడు టావశ్యకమని అనేక శిష్యుల ప్రార్థన మేరకు ఒక్కసారి మాత్రం (1952) బళ్ళారి, నేమ్మకల్లు, ఆదోని యీ మూడు చోట్ల ఉపన్యాసమొసగు కృపను ప్రసాదించిరి. వారి ఆదోని ఉపన్యాసమే యిది.

జగత్కల్యాణమునకై కొంతకాలం తమ "అజ్ఞాత సంచారవశ్యకత" కలదని తెలిపి 1958వ సం॥రం ఫిబ్రవరినెల 4వ తేది వారు సమాధిస్థులైరి.

పునః తాము బయటవచ్చి 'జనబాహుళ్యమున వ్యవహరించు కాలం సమీపించినది.' అని యిటీవల వా రానతిచ్చినారు.

ఇట్టి అపూర్వ పుణ్య సంధికాల మాసన్న మైనందున సర్వ మానవులు జాగృతులై వారి బోధన ఆలించి, దాదాపు రెండువేల సంవత్సరముల నుంచి లోకమున కలభ్యమై నేడు ఆ పూర్ణుని ద్వారా ప్రసాదింపబడిన అమృత విద్యను ఆశ్రయించి ఆనందమనుభవించి ఆ దేవదేవుని అవతరణముకై ప్రార్థింతము.

ఓం శాంతిః

-స్వామి జయతీర్థ

# సమర్పణం

"వర ఋష్య మూక వాసుడు
పరవిద్యాభాసురుండు పరమేశుడు, సు
స్థిర వదసంధాత । ఋషీ
శ్వర సేవ్యుం డచ్యుతుండు - పాలించు కృపన్"

మానవకోటికి గల శాశ్వత సమస్యలను శోధించి, సాధించి బోధించువారే విశ్వాత్ములు. వీరి పవిత్ర ప్రసంగములు నిత్యనూతనములు. సర్వకాలికములు విశ్వజనీనములు.

1952లో ఒక పర్యాయం- మా గురువులు ప్రభు శ్రీ యోగి అచ్యుతులు ఆంధ్రప్రదేశమున పర్యటించి ఉపన్యాసమొనరించిరి. వారు ఆదోనిలో గావించిన కన్నడ ప్రసంగమే ఈ "ఏకైక మార్గం"

ఈ దుఃఖమయ ప్రపంచమున జన్మించి, రోగ, జరా, మృత్యు భయాదులచే నలిగి, తరించు సాధన తెలియక విలపించుచున్న సోదర మానవాళి మోక్షమున కేకైక మార్గమగు "ప్రత్యక్ష సాధన" నెరిగించి. విశ్వకల్యాణం సంతరించు యోగి అచ్యుతులఅనుభవ దివ్యవాణి యిది.

నాస్తిక ఝుంఝూనిలములు - ప్రజాహృదయముల నల్లల్లాడించు నేటికాలమున యీ యోగీశ్వరుని సందేశం సర్వులకు శిరోధార్యం.

తత్వ పూర్ణతలో భగవాన్ శ్రీకృష్ణుని, కర్మ పరాయణత్‌లో రాజర్షి జనకుని, ఆదర్శంగా కర్మయోగ సిద్ధాంతం నుద్ధింపజేసి తాను సాగి ముముక్షువుల సాగించుచున్న మహత్తర యోగి యగు ఋష్యమూకాశ్రమ ప్రభువుల దివ్యచరణ సన్నిధానాశ్రయం అనేక జన్మల సుకృతవిశేషముచే నాకు లభించి, వారి కన్నడ ప్రసంగములు తెలుగునవ్రాయు మహద్భాగ్యం ఒనగూడినందులకు ధన్యుడను.

యౌవనములో విషయానంద మనుభవించి వార్ధక్యములో మోక్ష సాధనా ప్రయత్నమున సాగవచ్చునని యనుకొనుట వెఱ్ఱితనం. అవాఙ్మానసన గోచరుడగు పరమేశ్వర సాక్షాత్కార కార్యసిద్ధి కావలెనన్న శరీర మనోపాటవములు చరుకుగా నుండి తీవ్రకృషి చేయవలెను. అట్లుగాక పట్టుసడలి రక్తం రంగుమారి ఇంద్రియ పటుత్వము మణిగిపోయి మనసుచెదరు వృద్ధాప్యములో చేయు ఇహలోక కృషియైనను ఫలింపనపుడు ముక్తిసాధన సాధ్యమా? అని సుంతప్రశ్నించుకొనుడు.

ఉపన్యాస శ్రవణముచే కలుగు ఉత్సాహం క్రియా శూన్యమగు శుష్కావేశం! తాత్కాలికమేగాక నిష్ప్రయోజనం నిశ్చలమానసముతో తరచి, ఆచరణయందుంచి, సాధించుటలో సార్థకత కలదు.

నా యనువాదములో భాషా లోపము లుండవచ్చును. గుణ గ్రహణధుర్యులు ధైర్యమిత్తురుగాక.

ప్రసంగము చిన్నదైనను విషయసమగ్రత -తత్వ నిరూపణ లందు మిన్న! ఆంధ్రప్రజ లాబాలగోపాల మీ "యమృతవాణి" నాలించి, ఆశ్రయించి, ఆచరించి, తరింప నాశించుచు, అట్టి శక్తిసామర్థ్యముల నెల్లరుకు ప్రసాదింప నా గురుదేవుడు యోగి అచ్యుతుల ప్రార్థించుచూ, ఈ కృతిని వారి పవిత్ర పాద సన్నిధికి వినమ్రుడనై సమర్పించు కొనుచున్నాను.

సర్వం అచ్యుతార్పణమస్తు

-సత్యాకాంక్షి,

నేమకల్లు రామన్న

కృతజ్ఞత

ఇహ పరతారకమై ధర్మానురక్తికి వెలుగుబాటయైన “ఏకైక మార్గమను” గ్రంథ ముద్రణమున కగు వ్యయమును ఉదారముతో భరించిన శ్రీయుతులు కామళే చూడప్పగారి కుమారులు శ్రీ వ్యాసరాజ్ గారికి సర్వశుభప్రదాత ప్రభుశ్రీ యోగి అచ్యుతులు వారికి వారి కుటుంబ సభ్యులందరికాయురారోగ్య సుఖసంపదల నిచ్చి బ్రోచుదురుగాక!

-ప్రకాశకులు
ప్రసారంగ సమితి,
శ్రీ అచ్యుతాశ్రమము,
ఉరవకొండ-515812

# ఏకైకమార్గం

తత్త్వాకాంక్షులారా !

మీ యందరి ధర్మాభిమానం, తత్త్వము నెఱుంగ గోరు కుతూహలములకు చాలా సంతోషము !

"సర్వధర్మముల ప్రబోధమూ ఏకమేవమైన తత్త్వమే యనుటను గురించియు, ఆ 'శాశ్వత పదవి' 'పరమపదవి' యగు మోక్షమునకు ఏకైకమగు ఆ మార్గమెయ్యది? దీనిని గూర్చి పూర్వులు చెప్పినారా? వారి ప్రవచనాల నైజం (సత్యత) ఈనాడు మన యనుభవమున గాంచనగునా ? యనుటను గురించుయూ విచారింతము."

## 1. తుష్టి పుష్టి నిచ్చునదే సాధన

తత్త్వాకాంక్ష కాలానుగుణ్యముగా వచ్చును. అందునను రోగాదిబాధ, కష్టసమయం, చావు మూడునపుడు, అన్నంత మాత్రమున తత్త్వము నెఱుంగుట సులభముగాదు. చిన్న మాటలో చెప్పవలెనన్న "మిమ్ములను మీరు తెలుసుకొనుడు" మిమ్ము మీరు తెలియక వేరొకరిని తెలియజాలరు. దాహపీడితునకు నీరు, ఆకలిగొన్నవాని కాహారం, శ్రమించినవానికి నిద్ర, ఏ విధముగా తృప్తిని, చైతన్యమును యిచ్చునో, సాధకునకు తృప్తి చైతన్యముల నిచ్చునట్టి దయిన యదియే నిజసాధనా మార్గం.

మనుష్య జన్మ ఎందులకు వచ్చినది? ఒక డొక రథమును (మోటారనండి- బండియనండి) ఎందులకు నిర్మించుకొనును? దాని వలన పనిచేయించుకొనుటకే. ఈ కాయము గూడ లోపలగల చేతనమున కొక రథము! కర్తవ్యము కొఱకేవచ్చినది. భూమి యందుద్భవించిన ఒక సస్యవర్గంసహా ఆకు, పూవు, పండు, నీడలను యిచ్చి పరోపకారమొనర్చుచుండగా సర్వ ప్రాణులందు శ్రేష్ఠమగు ఈ మానవ జన్మ కేవలం ఉదర పోషణకు కాదు. పరోపకారమునకును.

## 2.దైహిక శ్రమయే నిజమగు కర్మ

కర్మ చేయనిచో నిజమగు ఎఱుక కలుగజాలదు.

*శ్లో॥ "నహిదేహ భృతా సక్యం త్యక్తుం కర్మణ్యా శేషతః" అనియూ*

*"కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషేచ్ఛతం సమాః*

*ఏవం త్వయి నాన్యథేతోఽస్తి నకర్మలిప్యతే నరే " అనియూ*

గీతావాణి చాటినది. ఉపనిషత్కారులు ఘోషించినారు. "ధర్మకర్మలతో బాటు పూర్ణజీవితం అనగా 100 ఏండ్ల కాలం బ్రతుకుడు" అని తాత్పర్యము.

తన దేహకష్టముతో దేహ పోషణ మాత్రమే గాక యితర ప్రాణులకు సహాయ సహకారము లొనరింపవలెను. ఇదే నిజమగు పరోపకారము! ఎవరో గడించిన ధనము నెవరికో దానమొనరించుట నిజమగు పరోపకారము కానేరదు. కావుననే "పరోపకారార్థ మిదం శరీరం" యనుట. "దైహిక శ్రమయే నిజమగు కర్మ" దీనిని వదలి యేమేమియో చేసి, మోక్షసాధన మొనరించుకొను చున్నామని గ్రహించుట భ్రాంతి.

కర్మయందు స్థూలకర్మ, సూక్ష్మకర్మ లున్నవి. స్థూల కర్మలయందు 'సస్యముల పెంపకం', (వ్యవసాయం) శ్రేష్ఠకర్మ. కృషీవలులకు శాంతియుండును. కర్మాచరణమందరు చేయవలెనా? అవును. వెనుకటి ఋషులు కూడా కర్మలోపమునకు లోబడలేదు. కృషి, పశుపాలనల వంటి స్థూల కర్మలు," బ్రహ్మ విద్యాదానం- నిష్ఠల" వంటి,సూక్ష్మ కర్మలందు సాగుచుండిరి. జ్ఞానియగు జనకుని ఆదర్శం కూడా మనకు దీనినే తెలియ జేయును. ఇటీవల స్వార్థం, సోమరితనం పెచ్చుపెరిగినందున 'కర్మలోపం' కలిగినది.

## 3. బ్రహ్మ నిష్ఠలో పునశ్చైతన్యం

కర్మాచరణ వలన తమకు నష్టం లేదా? యని ప్రశ్న. బ్రహ్మేంద్రియముల వలన నగు సూక్ష్మ కర్మయందు 'తనవారు' 'తనకు' అను మోహమున బడిన మనోశక్తియూ నష్టమగును. చూచునపుడు వినునపుడు "హితమైనది, అక్కరలేనిది" యను భావనల కల్పన కూడదు. స్థూలకర్మ యందును కర్తవ్య ఫలాపేక్షకై బాధపడుట వలన నష్టము కలదు. కర్మ నాచరించియే తీరవలెననుట ధర్మం. ఫల విషయం యోచింప కూడదు. ప్రయత్నమే మన కర్తవ్యం. ఈ రీతిగా కర్మాచరణచే కాగల నష్టములను తప్పించుకోవచ్చును. అదియుగాక బ్రహ్మ నిష్ఠయందు పున్శ్చైతన్యమును సంపాదింపనగును.

## 4. సాధకునకు సంకుచిత భావన కూడదు

ఇక తత్వసాధనకు అర్హులెవరు? అందరూ! యిందులకు జాతి, మత, పంథ, స్త్రీ, పురుష, బాల, వృద్ధ యిత్యాది బేధములు పూర్వకాలమున లేవు. యిప్పుడును లేవు. యెప్పుడును వుండవుకూడ! ఈ మాటలచే సనాతను లనుకొనువారికి కోపము రావచ్చును. "సంకుచిత భావనతోనే భారతదేశం నేడు అధోగతి పాలనైది." విశాలభావన మావశ్యకము, సర్వుల ఉద్ధారమునకై యున్న ఆ సర్వవ్యాపి అగోచర స్థితియందు కలదు. సర్వా ధారుడైన ఆ సర్వవ్యాపి నెఱుంగక మరి దేనిని యెరుగజాలము. సాధ్యముకాదు. ఆ చేతనం ఏది? ఎట్లున్నది?

*శ్లో॥ ఏకోవశీ సర్వ భూతాంతరాత్మ! ఏకం రూపం బహుధా యం: కరోతి తమాత్మస్థం యేనుపశ్యంతి ధీరా! స్తేషాం- సుఖం- శాశ్వతం నేతరేషాం"*

*"సర్వభూతేషు యే నైకం భావమవ్యయమీక్షతే అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికం"*

*"ఈశా వాస్యమిదం సర్వం యత్కించ జగత్యాం జగత్ తేనత్యక్తేన భుంజీథా మాగృధః కస్యస్విద్ధనమ్"*

*"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి భ్రామయ్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా"*

ఈ రీతిగా పూర్వికులు యెల్లెడలను "ఈశా! ఈశ్వర!" శబ్దములనే ప్రయోగించుచూ, ఆ చేతనమే సర్వే సర్వత్ర సదా నిండియుండుటే గాక, సర్వప్రాణులందును జీవాధారముగా నెలకొని, హృదయ స్థానమున సంతతము ఆడుతూ ఆడించుచున్నది". అని ఉద్ఘోషించి యున్నను, ఆ 'ఈశ ఈశ్వర' శబ్దముల గూర్చి సరియైన విమర్శయే లేకున్నది. కడకు 'మూర్తి ప్రతిష్ఠ' యందు సాగునప్పుడై నొకవేళ యీ విమర్శ రాగలదేమో అనుకొని విగ్రహారాధనముల ప్రవేశ పెట్టిన వారి ఆశయము కూడా నెరవేరకున్నది. కేవలం అరచుచుండుటచే గానీ, చూచుటచే గానీ, చింతించుటచే గానీ 'ముక్తి సాధన' సాధ్యము కాజాలదు.

## 5. సర్వకాల సర్వావస్థలలో హెచ్చరికతో నుండునదే బ్రహ్మం!

*"యద్వాచా సభ్యుదితంతేన వాగభ్యుద్యతే తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే"*

"యన్మనసా నమనుతే యేనా హుర్మనోమతమ్ తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే"

"యచ్చక్షుషా నపశ్యతి యేన చక్షూంషి పశ్యతి తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే"

"యచ్ఛ్రోత్రేణ నశృణోతి యేన శ్రోత్ర మిదం శృతమ్ తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే"

"యత్ప్రాణేన నప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే  తదేవ బ్రహ్మత్వం విద్ధినేదం యదిద ముపాసతే"

అని ఉపనిషత్కారులు నిష్కర్షగా నిర్వచించి యున్నారు. అనగా నెయ్యది వాచాశక్తి కాధారమయే వాక్కున కందదో, ఎయ్యది మనస్సున కాధారమయ్యు మనసుచే నెఱుంగ బడదో, అయ్యదియే బ్రహ్మమని తెలియుము. దేనిని బ్రహ్మమని ఉపాసించుచున్నారో, అది బ్రహ్మముకాదు. బ్రహ్మేంద్రియములు మరియు మనసు ఆ బ్రహ్మము నెఱుంగజాలవు. బ్రహ్మేంద్రియములను, మనసును ఎఱుంగగల దానికే  బ్రహ్మము నెరుంగ సాధ్యము అనగా యిప్పుడనుభవించగల జాగ్రత్ అవస్థ మరియు నిద్రావస్థలందు నెయ్యది హెచ్చరికతో నుండునో అదియే బ్రహ్మము. అనగా శ్వాసగతితో కూడి యాడుచున్న ప్రాణుడు! దీని ద్వారా బ్రహ్మత్వము నెఱుంగుటకు ప్రాణుని తెలియ వలెను. ప్రాణుని ఎఱుంగుటకు తాను ఆధారపడిన వాయువును తెలుసుకొనవలెను. అందువలన 'వాయువే' మొదటి ప్రత్యక్ష బ్రహ్మమని గ్రహింపవలెను.

## 6. మూలాధార చేతనమే, ముక్తి సాధనము.

సర్వేంద్రియములున్న మనస్సుయొక్క ఆధారము నందున్న వను అంశమెల్లరకు తెలిసినదే, కాని యీ మనసు దేని ఆధారమున నిలిచినది? కన్నులు, చెవులు, ముక్కు, నాలుక మొదలగు ఇంద్రియములకు సోలు (అలుపు) యున్నట్లు, యీ మనసునకు అలుపు (మబ్బు) కలదు. గాఢనిద్రయందు మనసు పనిచేయదు. స్థబ్దమై పడియుండును. మనసు స్వతంత్ర చేతనమే యైన దానికి సోలు మబ్బు లుండుటకు కారణములేదు. సోలు గెలుపులు గల యీ యింద్రియములు మనసుయొక్క ఆధారముపై నుండి ఒక వ్యాపారవృత్తియందు ఆడి పడిపోయిన వైనందున శాశ్వతానందదాయకమగు మోక్షసాధన వీని వలన కలుగుననుట భ్రాంతి! మనసు చేతను అంతియే, అన్నింటి మూలధారమైన చేతనము' నాశ్రయించిననే అయ్యది సాధ్యము. మహాత్ములు తెలిపినదియు మా యనుభవములో కనిపెట్టి నదియు నీ విషయమే.

దేహములో ప్రాణ చేతనము వున్నంతవరకే మనసు మరియు దేహము పని చేయగలవు. ఈ దేహము నుండి ప్రాణచేతనం వెడలి పోయినంతనే మనస్సు వుండదు. దేహ ముండియు నిష్ప్రయోజనము. కావున ఈ జగత్తులో ఈ దేహముతో వుండి, (మంచికాని, చెడుకాని) దేనినైనను తృప్తికరముగా చేయవలెనన్న అంతవరకు ఈ దేహములో ఆ 'ప్రాణ చేతనము' వుండుటావశ్యకము కదా? అందుకే ఆ ప్రాణ విజ్ఞానమును (Spritual Science) కనుగొని అనుసరించుట, సాధించుట  అత్యవసరం.

## 7. ప్రత్యక్ష సాధనా వినా పరమాత్మ దుర్లభం

పూర్వికులు, గ్రంథములు ఎంత వర్ణించినను యిప్పటి వారికి సాధన  లేక దానిని గ్రహించుట కష్టం! బహుకాలము నుండియు సాధనా అలవాటు తప్పినందున యిప్పుడు కష్టముగా తోచును. కేవలం గ్రంథ పాఠము నోటిపాఠములచే తత్వము నెఱుంగగలమనుట వెర్రితనము! ఒక మోటారు యంత్రమును దాని నడుపు విధమును వర్ణించిన పుస్తకములుండవచ్చును. యేండ్ల కొలది పుస్తకముల కంఠస్థము చేసిన వానికంటే చదువకున్నను అనుభవజ్ఞుని వద్ద నేర్చినవాడే మేలు! ఇదే ప్రత్యక్ష సాధకునకు - కేవల గ్రంథముల చదువరికి గల వ్యత్యాసం!

ఈ బ్రహ్మ పదవికేగు సాధనపై నెల్లరకు హక్కు గలదు. కానిచో వాల్మీకి, ఋషిపత్నులు మహాతపస్వులగుటకు కారణముండదు. మహా పురుషుల కృతి ముఖ్యం, వారి జాతి, పేరు-ప్రఖ్యాతులు కాబట్టవు పరమాత్మునకు ఉపనిషత్కారులు యే పేరును పెట్టలేదు. వారి కెన్ని పేరులు నొసగగలము? వాని నెంతని వర్ణింపగలం? అలాగే ఆ మహాత్ముల ఆదర్శమున సాగి, మోక్ష సాధన మొనర్చువారికి మేలు కీడుల భేధం లేదు.

## 8. నిజస్థితి – తల్లిగర్భం.

మనలను నిద్రా జాగ్రత్తలందు కాపాడుచున్న ఆ వాయు శ్రేష్ఠునకు శరణాగతులైననే గురి నేర సాధ్యం ! అయిన 'వాయోనమః!' అనిన చాలునా? కాజాలదు. దేహమునం దద్దాని నిజస్థితి నరయ వలెను. 'నిజస్థితి' యనగా అది మన యందింతకు పూర్వమున్నదే యనికదా అర్థం? అవును వున్నదే. ఇప్పుడెట్లు తప్పినది? తల్లి గర్భము నందున్నప్పుడు బయటి స్థూల వాయు సంపర్కము లేకనే ప్రాణుని గతి దేహమునందు నాభినుండి బ్రహ్మరంధ్రము వరకు తన నిజస్థితి యందే యుండెను. ఆ స్థితిలో కన్నులు మొదలగు బ్రహ్మేంద్రియములు, మనసూ, ఆ ఉత్తమగతి (భ్రూమధ్యము) వైపు చూచుచూ, గమనించుచూ, అంతర్ముఖముగానే యుండి భూగర్భముపై బడినంతనే బయటగల విశాలమైన గాలిచే నాకర్షితమై మనసు కూడ బహిర్ముఖమై, ఇంద్రియముల ద్వారా జగత్తునంతయూ వ్యాపించుకొన్నంతనే మృత్యువును కౌగలించినట్లు అయినది.

క్రమేణ స్థూలదేహం పెరుగుతూ, వాత, పిత్థ, శ్లేష్మాది ఆహార దోషముల వలనను, మనోవ్యాపకతతో గలుగు క్షీణతా చాంచల్యముల వలననూ, తన ఆదిస్థితినే మరచి, పునః హెచ్చరిక పరచుచూ మబ్బున ద్రోయుచూ నున్న యీమనసు తుదకు పశ్చాత్తాపం నొందును, కాని అప్పుడు కాలము మించినందున ఉపాయము లేకుండును. అది ఎప్పుడు? అని యోచింపగా - ఇల్లు పడిపోవునప్పు డద్దాని వదలి వేరొక యింటిని వెదకి చేరుకున్నట్లు. తన రథము విరిగిన యింకొక రథము చూచుకొన్నట్లు, ఈ మనసు యొక్క మోసమున బడి, దేహం క్షీణగతికి వచ్చినచో నందుగల చేతనం నిర్గమించును. ఆ రీతిగా వెడలునప్పుడయ్యది తన మూలస్థానం సేర ప్రయత్నించును.

అందుచేతనే మృత్యుకాలమున అంగాంగముల లాగికొని తన్నుకొనుచూ, దృష్టి భ్రూమధ్యముననే చూచు ప్రయత్నమున ఊర్ధ్వ దృష్టి (పైచూపు) కలిగి, ఊర్ధ్వ శ్వాస (గొరకపెట్టుట) ప్రారంభ మగును. కాని స్వయంకృతాపరాధము వలన ప్రాణుని గతికి (కఫము) ఆటంకమైన మూలస్థానం నేర సాధ్యము గాక బయట పడిపోవును.

ఇందులకు ముఖ్యకారణం మనస్సు యొక్క వ్యాపకతయే, ఒక పాత్రలోని పొగ మూతను తీసినంతనే గది యంతయూ వ్యాపించు నట్లు, భూగర్భమున పడినంతనే దీని స్థితియునట్లే యైనది. ఆహారాది దోషములచే దీని వికల్పం మరింత యధిక మగును. శిశువునకు సర్పము కనబడినను భయము కలుగదు. అపాయము కలుగదు. ఏల? వికల్పం లేనందున, ప్రాణుని శుద్ధగతికి హెచ్చు ఆటంకం లేనందున, యిట్టి స్థితినే పునః సంపాదింపవలెను. ఎట్లు?

## 9. అశనమే ప్రాణున కావశ్యము

ఏ దారి నుండి వచ్చితిమో ఆ దారి యందే పోవలెను. కావున ఆ వాయువునే పట్టి సాధించిన సాధ్యం. 'అన్న గతః ప్రాణః ' అని వారు. 'అన్న మనగా భోజనముకాదు' అట్లేయైనచో ఎవరూ చావకనే యుందురు. ప్రాణున కావశ్యమైన శుద్ధాంశ మగు అశనమునకు (ఓజోన్ Ozone) 'అన్న' మని చెప్పబడినది. ఇంద్రియాదికముల వ్యాపారముచే ఆ యంశము ఖర్చు అగుచున్నందున దాని నీ సాధనలో సంపాదింపవలెను. ప్రాణునకీ యశనం తక్కువైనచో (దేహమునకు) అలసట, మబ్బు కలుగును. సర్వేంద్రియములు కదలించి, ఆవలింపు వచ్చును. పైలోకం (బ్రహ్మస్థానం) నుండి నీరు తెప్పించును. ఈ ఆవలింపు లెందులకు వచ్చును? తన మూల స్థానము సేరుటకు ప్రాణగతి యొక్క ప్రయత్నమది! రోగులకు ఆవలింపులు రానిచో చావు

సమీపించినట్లే! ఆకస్మికముగా భయము కలిగినప్పుడు ఎదలో 'ఢక్' అని ఒక విషయం పైకి లేచును. అదెందులకు? దూడలు భయపడినపుడు తల్లిదాపులకు పరుగెత్తునట్లు ఆ 'ప్రాణగతి' కూడా తన మూలస్థానం చేరుటకు పైకి లేచును. నిద్రయందును. కొనిసార్లీ స్థితి స్వల్పకాలం మాత్ర ముండును. ఆ స్థితిని గమనించి, సాధనలో నుంచి, సాగినచో మున్ముందు సోమపానం అమృతపానములు లభించును. ఇందులకు ' ప్రాణప్రతిష్ఠ' కావలెను.

**10. ప్రాణ ప్రతిష్ఠతోనే యిచ్ఛామరణం**

'ప్రాణ ప్రతిష్ఠ' యని స్థూలముగా విగ్రహ పుజాపద్ధతి యందు సాగించుచున్నారు. కాని తనను తా నెఱింగి, పరమ పదవిని బడయుటకు ఈ సాధనలో 'తనయందే ప్రాణ ప్రతిష్ఠ' కావలెను. మోక్షసాధనకై యేమేమియో చేయబూని యేమియు గాంచక, తెలియక వ్యర్థముగా చచ్చుటకంటే, యీ మార్గమున సాగి, ఎఱుక గలిగి, చెప్పి, విని,యిచ్ఛామరణమును పొందుట మేలు!

పూర్వికుల విషయమునందు తెలుపబడిన ఈ 'ఇచ్ఛామరణం' 'సమాధి' జలసమాధుల' విషయమై సంశయము వలదు. అయ్యవి యదార్థమే. పూర్వికులట్టి స్థితి యందుండిరి! వుంటున్నాము! సాధ్యము!! ఈ దేహం పంచ మహాభూతములచే నైనది. తల్లిగర్భమున బయటిగాలి లేకనే ప్రాణ సహితముగా నుండలేదా? ఇది బ్రహ్మచారి కెట్లు తెలిసి యుండునను సందేహం వలదు. మాకు తెలియని విషయం లేదు. ఇది అతిశయముగా కనిపించినను, నిజము. గర్భమున ప్రవేశించియు చూడగలం! రోగుల దేహమున దూరియు చూడగలం! సర్వాంతర్యామి యైన చైతన్యమునుబట్టి సాగిన వాని కన్నియూ సుసాధ్యములు!!

**11. ఆహారనియమం – మత్తుమనోమోసకారి**

'సనాతను' లనుకొను వారికి కోపం కలిగియుండును. అవును. సులభముగా అర్థం గాజాలదు. ప్రాణుని వైపు లక్ష్యము నుంపక, వివిధములగు స్థూల విషయాసక్తులై, సాధనలో సాగుచుంటిమని తలంచుట భ్రాంతి! మరియు అర్థం గానందులకు మరియొక కారణం -మనకున్న 'నిశ!' (మత్తు) తప్పుగా భావించరాదు. ఈ 'నిషా' సారాయి, కల్లు, గంజాయి, ఆఫీము లందు మాత్రమే కాదు. మనము సేవించుచున్న ప్రతి పదార్థాము నందునను కలదు. కాని ప్రమాణములో నెక్కువ తక్కువ లుండును. కావున ఆ మైకం పోవుటకు ఆహార నియమం కావలెను.

'సాత్త్వికాహారమే శ్రేష్ఠము. సులభముగా జీర్ణింప చేయుటయే సాత్త్వికాహారపు ఒక విశిష్ట లక్షణం! ఇంతవరకు మనకు తెలిసినట్టి 'ఆహార గుణ విభజన' పొరపాటు. 'నేయి' సాత్త్వికాహార మనియే సర్వుల గ్రహికం. అది తప్పు సాత్త్వికాహార స్వీకారముచే మన దేహమునకు, మనసునకు యేవిధమైన విరుద్ధ పరిణామం కలుగకూడదు. శ్రీకృష్ణుడు 'వెన్నదొంగ'యే కాని 'నేతి దొంగ' కాడు. వెన్నయందు సాత్త్వికాంశ మధికముగా నుండుటయే యిందులకు కారణం.

మాంసాహారులు కోపగించుకొనరాదు. మృత్యువాత బడకుండా సాగవలెనన్న నేను చెప్పుచున్న 'సత్యమును' గైకొనుడు. సస్యాహారి యగు గోవు, మాంసాహారి యగుపులి ఈ ప్రాణుల దేహ స్థితులను గాని స్వభావములను గానీ పోల్చి, పరిశీలించినచో ఆహారపు గుణమేమి? యనుట గ్రాహ్య మగును. హింసాహింస చర్చలేల? మాంసాహారి తన్నుతా నెఱుంగు సాధన యందు సాగుట కష్టము. సాధ్యము కాదని యే చెప్పవచ్చును. మాంసాహారం వలన మనస్సంబంధములగు షడ్రిపులు, అష్టావస్థలు పైకొనును.

**12. ఓంకారమే శరణ్యం**

ఆహార నియమమున వర్తించుచున్నచో సులభముగా 'ప్రాణ ప్రతిష్ఠ' యగునని అందరు వెంటనే గ్రహింపగలవిషయం. ఆ 'ప్రాణ ప్రతిష్ఠ' ఏలాగు? పూర్వీకులైన సత్పురుషు లీవిషయమై చెప్పలేదా? చెప్పియున్నారు. కొందరు మహనీయులు "మోక్షసాధనకు- త్రివేణి సంగమమున స్నానం చేయు'' మనిరి. స్థూలమునందు గంగా యమునల సంగమ మగుపడుచున్నది. సరస్వతి కనుపించదు. మోక్ష సాధన కాలేదు. మరియొక్కరు- 'దగ్గర కేగి తట్టుము తెరచు కొనును' అని తెలిపిరి. ఇంకొకరు 'పై స్థానమున కేక వేయు' మనిరి. ఇప్పటివారు స్థూలమున గుడి బయట నిలిచి తలుపు తట్టిరి. బయట యెత్తైన స్థలమున నిలిచి బిగ్గరగా అరచిరి. కాని మోక్షం దొరకలేదు. దొరకజాలదు. మనయందలి త్రివేణి స్థానం యొక్క చరచునట్టి అరచునట్టి స్థానమును గురించి ఆ మహాత్ములు నిర్దేశించిరి. కాని ఈనాడు వారి అనుయాయులను వారు వారి మార్గమున గ్రహింపలేదు. ఆ మార్గము 'ప్రణవము' నందు గలదు. 'అదియే ఓంకారం!' ఆ ప్రణవమున కెల్లరు ప్రాధాన్యత నిచ్చియున్నారు. ఉపనిషత్కారులు సహా:

*"ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్''*

ప్రణవమే-ధనస్సు' (అనగా ప్రాణుని అఝుంకార శబ్ధమే విల్లు) దానిని నడుపు 'మనసే- బాణము' అనగా ఆ ప్రణవనాదం వైపు నిశ్చల లక్ష్యము గలిగి)'బ్రహ్మమే-గురి' (బ్రహ్మమనగా బ్రహ్మేంద్రియముల కూటపు ప్రథమ స్థానమగు భ్రూమధ్యమునకు) గురి యుంచి, నడిపించుచూ (విలుకాడు తాను ప్రయోగించిన బాణం గురి సేరు వరకు దాని గతియం దే రీతిగా తదేక దృష్టి గలిగియుండునో ఆ రీతిగా) తన్మయుడై యున్నచో దానిచే తన మనుష్యత్వం మేలు కొనును' అని తెల్పియున్నారు.

ప్రాణుని గతి యందు అగత్యముగా కలుగగల ఝుంకారమే ఆ 'ప్రణవము.' సర్వేంద్రియములు ఏక స్థానమున నిలిచినచో దాని గ్రాహ్యమగును. అంధపూజ, అంధశ్రద్ధలతో సాధ్యముకాదు. అందుకే శంఖమున ఊది చూడుడు. శంఖమనగా స్థూల వస్తువుకాదు. దేహము నందలి. 'శంఖము' అను స్థానమున ఆ ఊదుటయు బయట వ్యాపింపకూడదు. లోపలనే చెవులు ప్రణవమునే వినవలెను. కనులు భ్రూమధ్యమునే చూడవలెను. ఈ భ్రూమధ్యమున కేల యింత ప్రాశస్తం? ఆ స్థానము నందేమో ఒక మహత్తరమైన 'గుట్టు' కలదు కావుననే సర్వమతములవారు. సర్వ ధర్మములవారు నమస్కరించునపుడా స్థానమునకే ప్రాధాన్య మొసగియున్నారు. ఈ చర్య యొక సంకేతం! ('ఒనరుగా త్రికూట భ్రూమధ్య మందున్న వాడెవ్వడో చూడమన్నా' -తత్త్వగేయం) దాని 'గుట్టు' నెఱుంగుటకు దృష్టి నిలిపి. ప్రణవమును విల్లు గావించుకొని, మనోనిష్ఠతో సాగిననే సాధ్యం! అట్లు సాగుచున్ననే తాను వచ్చిన మార్గం అదిస్థానం నెఱుంగ నగును. చేరవలసిన స్థానం సహా అదియే! కావున తనను తాను నెఱుంగ సుసాధ్యమగును.

*"మూరారు వాకిళ్ళు మూయవలెనన్నా*

*ముక్తి వాకిట నిలిచి తలుపు తీయన్నా*

*తలుపు తెరచిన బ్రహ్మ మెరుక పడునన్నా''*

**13. ప్రాణాయామమే ప్రత్యక్ష సాధన**

అయినా యీ వాయు చైతన్య మే జీవుడా? ఈ ప్రాణుడు తల్లిగర్భమున కెట్లు వచ్చెను? ఇది అంత సులభముగా అర్థం కాజాలదు. హంస నీరు వదిలి పాలనే గ్రహించునట్లు ఈ వాయువు 'గతాగతి' యందుంచి, శుద్ధీకరించి, ఆ శుద్ధాంశమును ప్రాణుడు జీవున కొసంగును. కాబట్టి వాయువే మనకు మొదటి ప్రత్యక్ష బ్రహ్మ! ('నమస్తే' వాయో! త్వమేవ ప్రత్యక్షం

బ్రహ్మాసి, త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి'-ఉపనిషత్) ఆ వాయువును బట్టి సాగునపుడు 'జీవుని' పిమ్మట 'ఆత్మను' అరయ నగునే కాని, 'ప్రత్యక్షసాధన' లేకుండా పైస్థితి విషయములు తెలియ సాధ్యంకాదు.

మనం తల్లి గర్భము నందెట్లు ప్రవేశింతిమో చూడుడు. తండ్రిగర్భము నుండియే. ఎట్లు? ప్రాణుని గతాగతిచేత. ఇదిగో దానినే యిపుడు 'ప్రాణాయామముచేత' అనుచున్నాను. 'ప్రాణాయామం' అను శబ్దం విన్నంతనే భయ వికల్పములకు లోనుగాకుడు. ప్రాణామాయ మొనరింపని మానవుడే లేడు! ఒక్కొక్కపు డెల్లరు సాగింతురు. కాని, గమనింపరు.

సతీపతులు కూడు నపుడు ఒక 'నిష్ఠ' కలుగును. దానిని సంసారులైనంత మాత్రమున వీరు వర్ణింపజాలరు. ఆ సమయమున దేహమున ప్రాణుని గతాగతి హెచ్చుతూ ఏక నిష్ఠయందు నిలిచి, యింద్రస్థానం గదిలించి, 'వీర్య' మధోముఖముగా వచ్చి తల్లిగర్భమున బడి అండోపాధి యందుండి, పెరుగుచూ, తను వాకారం పొంది, వృద్ధియై భూగర్భమున పడును. యోగము నందుండి చూచి చెప్పవలెనన్న పంచ భూతముల భూగర్భం ఎంతో - అంతే మనకు తల్లి సంబంధం. కాని నిజముగా తండ్రి సంబంధమే హెచ్చు. ప్రాణాయామము కూడా తండ్రివలననే వచ్చినది. తండ్రికి- ఆ తండ్రి నుండి, ఈ విధముగా నయ్యది ఆదిలో పూర్ణత నుండియే వచ్చినది. 'పూర్ణత కెచ్చటి నుండి? ఈ ప్రశ్న మనకవసరం అందుచేతనే పూర్ణమనుట దానికి తక్కువగుటయే లేదు. కావుననే ఉపనిషత్కారులు-

*"పూర్ణమదః పూర్ణమిదం। పూర్ణాత్పూర్ణ ముదచ్యతే ।*

*పూర్ణస్య పూర్ణమాదాయ। పూర్ణమేవా వశిష్యతే॥"*

అనియున్నారు. ఒక దీపం నుండి చిన్నవియు, పెద్దవియు నగు దీపము లనేకములు వెలిగించినను, మొదటి దీపకళిక యధారీతి యున్నట్లు, మన మనసునేపట్టి గమనింపగా విశాల జగత్తు నందంతయు, వ్యాపించుకొని, పూర్ణముగా నగపడును. కాని ఈ మనసు కూడా ఒక చేతనం నుండి వెలువడినది. పునః ఉత్తమగతి కెక్కుచూ. అట సేరునపుడు (మనసుగానే) 'అపూర్ణ' మని తోచును. కాని ఆ చేతనం మాత్రం పూర్ణమే. ఈ మనసు నంటి సాగినచో తెలియును. ఆ రీతిగనే ప్రాణుని యొక్కయు, సృష్టి యొక్కయు మూల విషయములతో ప్రథమమున లభించు సాధనను బట్టి సాగినచో 'గురి' చేరనగును. ఆ గురి ఎక్కడిది? ఎక్కడినుండి వచ్చినది? యిత్యాది ప్రశ్నలు అ ప్రయోజకములు-సాధకుడు-తత్త్వాకాంక్షి వేయు ప్రశ్నలు కావు.

"ప్రాణాయామమే ముఖ్య సాధన!" కాని ఆవిషయం పూర్తిగా తెలియని వారు ప్రత్యక్ష సాధన లేనివారు, కేవలం గ్రంథవాసనలో లభించిన మిడిమిడిజ్ఞానంతో ఊహాపోహలతో యేమేమియో కృత్రిమ పద్ధతులను వ్రాసిరి. అట్టి పద్ధతుల నభ్యసింపబోయి, సాధకులనేకు లాపదల పాలై నందునే భయ కారణమైనది. ముఖ్యముగా గ్రహింపవలసిన దేమనగా ప్రాణుడు బయటగాక మన దేహము లోపలనే యున్నందున వాని కావశ్యకమై ఆ 'ఆయామ పద్ధతి' యులోపలనే యుండితీరవలెను. వున్నది కూడా. ('ముక్కులోని గాలి ముక్తికి త్రోవయా'- వేమన్న) ఆ స్థానము నందుంచి ఊదుటయే అది!

**<u>14. ఏకాగ్రతయే బ్రహ్మచర్యం!</u>**

అందుకు 'బ్రహ్మచర్య' మవసరం. ముక్కు మెదలగు వానితో కాగల బాహ్య చేష్టల వలనను, స్థూల పూజాదికముల వలనను' బ్రహ్మచర్యం' నిలువ జాలదు. స్త్రీ సంపర్క మొక్కటి వదలుట మాత్రమే బ్రహ్మచర్యం కానేరదు. <u>బ్రహ్మేంద్రియములను ఏకస్థానమున నిష్ఠయందు నిలుపుటయే వాస్తమైన బ్రహ్మచర్యం!</u> ఈ బ్రహ్మచర్యావలంబనం సంసారికీ అగత్యమే సన్యాసికీ

అగత్యమే. ఇది లేనిదే మోక్షసాధన యేరికి సాధ్యము కానేరదు. అందులకు 'ఈశ్వరసేవయే ముఖ్యం.'

కాని 'ఈశ్వర' అన్నంతనే మనం కల్పించుకొన్న సర్పహార, త్రిశూలాది ఆకారములతో, రూపించుకొన్న విగ్రహం ఎదుట తోచును. గదా? దానికి గాదు అట్లు చెప్పినది.

" ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి

భ్రామయన్ సర్వభూతాని యంత్రా రూఢాని మాయయా"

యను గీతావాణి గమనింపగా-సర్వప్రాణుల లోపల బయట 'శ్' అను శబ్దము చేయుచూ వాని నాడించుచున్న 'వాయుచైతన్యమునకే' 'ఈశ్వర' మనియు, ఉపనిషత్కారులు 'ఈశ' యనియు (ఈశావాస్యమిదం సర్వం) చెప్పినట్లు గోచరించును.

మానవ కల్పితము లైన, విగ్రహములందలి ఫాలనేత్ర సర్ప భూషణాధికములు సహా, ఆ వాయు చైతన్యమును బట్టి సాధనలో సాగునప్పు డగునట్టి స్థితుల సంకేతములే! సర్ప సహవాస మున్నట్లే- ప్రాణుని సహవాసం! తనకు ప్రియమగు 'నాదము' నాలించి నపుడు, సర్ప మానందముగా నాడును. కుచేష్టలు సాగించిన కాటు వేసి చంపును! అంతే ప్రాణుడు కూడా, తగిన ఆహారవిహారములందు నియమముగా సాగుచు, వానికి ప్రియమగు ఝుంకారమైన ప్రణవంలో సాగుచున్న క్రమంగా ఆనందం, జ్ఞానం, యిచ్ఛామరణం యిత్యాదులు సుసాధ్యము లగును. విరుద్ధముగా నడిచిన ప్రమాదం కలుగును.

**15. శంఖము ఊదుడు! శ్రీ కంటులు కండు!**

ఆ ఈశ్వరునే శంకరు డనిరి. శంఖమున ఊదునట్టి సంకేతమే యిది. ఆ శంఖమును మరచిన 'విషకంఠ' మగును. కంఠమునందే 'మృత్యువు' వేచియున్నది. ఆ స్థానము స్వచ్ఛము కాక, కల్మషముతో నిండి యున్నందుననే, చావు మూడినప్పుడు ప్రాణుని గతికి అడ్డు తగిలి అపస్వరమై బయట పడిపోవును. కావున 'శ్రీకంఠులు' కండి! అని చెప్పుచున్నాను. ప్రాణుని బట్టి ఆ కంఠము నందు ఊది 'మృత్యుంజయులు' కండి!

ఇక్కడ మరొక ప్రశ్న- "యోగమందు సాగువారు చావరా? ఈ మాట వేరే, చనిపోవు వారిలో కూడా ఏమియు గమనింపక, తెలుసుకొనక, రోగబాధలతో నలిగి పడిపోవువారు వేరే, భవిష్యత్ సంగతులు తెలిసి, చెప్పి, విని, యే రోగాదికముల బాధయు లేక-ఆరోగ్యంతో 'చాలు' ననుపించి నపుడు తమ యిచ్ఛ మేరకు కనుమూసిన వారు వేరే. ఇట్టివారి దేహములనే, దహనం చేయక 'సమాధి' చేయుట, వీరు మరణించినారని తలంపరాదు. ఇట్టి వారిలో 'యోగ సమాధిలో' కూర్చున్నవారు గలరు. అనంతరం కావలసిన వానిని గాంచి, వెడలిపోయినవారు గలరు.

ముఖ్యముగా చెప్పవలెనన్న ప్రాణుని గమనించిన సర్వము గ్రహింప వచ్చును. కానిచో సాధ్యమే కాదు. సనాతన అంధ శ్రద్ధాసాంప్రదాయకు లిది విని కోపగింపవలదు. వాస్తవముగా నున్న సత్యమునే చెప్పుచున్నాను. ప్రాణునే బట్టి తపస్సు చేయవలెను. కర్మ బద్ధతయూ కావలెను. కర్మ పరిత్యాగ మొనర్చిపోవ సాధ్యముకాదు. అట్లే నైనచో వాల్మీకి, ధృవుడు మొదలగు వారు పునః తపస్సు నుండి తిరిగి రావలసియుండలేదు. నా అనుభవం లోను అంతియే, నేను కూడా 'గవి' యందుండి వచ్చినవాడనే. కర్మభ్రష్టత వలన మోక్షం లభింపదు. ధర్మకర్మల నంటి సాగిన సుఖం గలదు. ఇదియు నా అనుభవమున కనుగొన్నదే, ఉపనిషత్కారులు దానినే ఘోషించి యున్నారు. ఇదేదీ నమ్మక 'భక్తి' యను పేరుతో అంధ శ్రద్ధ, స్థూల పూజలందు మగ్నులైనవారు గలరు. వారి విషయమై మన యభ్యంతర మేమియు లేదు. కాని సత్యము నెరుంగవలె నన్న ప్రాణుని బట్టి సాగుటయే ఉత్తమ

మార్గం ! అదియే ఏకైక మార్గం!!

ఈ విషయమున స్థూల విజ్ఞానశాస్త్రం తెలుపుచున్నట్టి 'ఊపిరి నాడించు కొన్ని ప్రక్రియల (ప్రయోగముల) వలన 'ఆమ్లజనక' మదికముగా లభించి, అద్దానిచే 'నాయుస్సు' వృద్ధి యగును.'' ఇత్యాదికముల నమ్మి అభ్యాస మొనరించువారు, దీనినే 'ప్రాణాయామ' మని చెప్పుచూ వ్రాయుచున్నారు. అది ఆధ్యాత్మ సాధనా వాస్తవ ప్రాణాయామం కానేరదు. ఈ కృత్రిమ ప్రక్రియ వలన స్థూలదేహం అపాయం  నొందుంటే గాక సుఖం కలగదు. ఈ బ్రహ్మవిద్య- ప్రాణాయామం తనదేహం లోపలనే నడుప తగినది యని నొక్కి చెప్పుచున్నాను. ముక్కు మొదలగు వాని ద్వారా కాదు. శంఖం ద్వారా (కంఠంద్వారా) లోపలనే, నాభి నుండి బ్రహ్మరంధ్రం వరకు ప్రాణుని 'గతాగతి' యం దుంచవలసిన 'సాధన' యిది.

**16. దాంపత్య జీవన మాటంకము కాదు**

ఇందుకు 'దాంపత్య జీవితం' కూడదని చెప్పువారు జ్ఞానులు కారు. సాధనకు దాంపత్య జీవిత మాటంకం కానేరదు. సతీపతు లిద్దరూ ఈ విద్యాభ్యాసంలో సాగుచు, యుక్తాహార విహారములతో యుండిన యీ సాధనా పరిణామముగా వారిద్దరి, నరనాడులు, రక్తం, శుక్ల శోణితములు, మనసు, ప్రాణచేతనము లన్నియు సంశుద్ధములైన సమర్థవంతము లగును. అట్టి దంపతులకు కలుగు సంతానం సదృఢశరీరులై, ఆరోగ్యవంతులై, శ్రేష్ఠజ్ఞానులై, జగత్కల్యాణ కారుకులై మనగలరు. ప్రాచీన కాలంలో తపస్వులైన మహర్షులు సంసారులై విశేషించి-100 మంది  బిడ్డలను కన్నవారు వుండిరి. కావున దాంపత్య జీవనం తపస్వులకు ఆటంకము కాదు.

**17. 'ఉపదేశము' యిది మాటకాదు, మంత్రము కాదు.**

ఇంత విపులముగా ఆది నుండి నేటి వరకు దాని నెవరు విశదీకరించి వర్ణించి యుండలేదు. అయినను అది యేలాగో మీకు అర్థం కాజాలదు. ఎదుట కూర్చుండి చేసినను, తెలియ జాలరు. దానిని శబ్దములు వర్ణించి ఎరుక పరచజాలవు. అందులకు 'ఉపదేశమే' కావలెను.

'ఉపదేశము' అనగా బోధించుట, అను కల్పన తప్పు. ఇది మాటయో, మంత్రమో అయినచో గ్రంథముల నుండియే నేర్వ వచ్చును. గురువుగారి ఆవశ్యకతయే అక్కర లేదు కదా? ఆ విద్య నెఱింగిన వాడు, ఆకాంక్షి యగు వాని చెవి దగ్గర తన ప్రాణుని ఝుంకారమున గతించిన గ్రాహ్య మగును. అప్పుడు వాని ప్రాణునకు మేల్గతికి అవకాశం కలుగును. ఇదియే నిజమగు ఉపదేశం.

ప్రాచీన కాలమునందీ గురువుగారి ఉపదేశమునకు చాలా ప్రయాసపడినారు. కష్టపడియున్నారు. నేను కష్టపడిన వాడనే, అయినా యీనాడామార్గమున సాగవలె ననువారు ఆరీతిగా నావలె శ్రమపడ నవసరం లేదు. అది కాలగతి యనుకొనుడు. ఏమి కాని, అందుకై తహతహ లాడువారికి చూపించుటకు నేను సర్వదా సిద్ధముగా నున్నాను. తప్పు తలంప వలదు. 'గురు' వనగా మార్గదర్శకుడు. యిందు స్వార్థయాశగాని, గౌరవాకాంక్షగానీ లేదు. నాయందు కలదానిని నేను గ్రహించినదానిని అందుకై శ్రమించు వారికి యివ్వవలసినదియు తెలుపవలసినదియు నా కర్తవ్యం. మానవధర్మం! అంత మాత్రమున నేనే తెలిసిన వాడ నను మాటకు కూడా నవకాశం లేదు. వివేకం గల వారెవ్వరు యిట్లు భావింపరు. ఈ విశాల జగత్తు నందు యెంత దీర్ఘకాలం బ్రతికి తెలిసి కొన్నను యింకను తెలియ వలసిన దెంతయో యున్నదనుట విద్యావంతునకు గ్రహికమే. అందుకే 'విద్యా వినయ సంపన్నే' మొదలైనవి చెప్పబడినవి.

**18. నిత్యమూ అమృతము గ్రోలుడు – అమరులు కండు!**



యోగి-యోగమున. జీవాత్మ సంయోగమున మధురరస మూరును. చిన్నారి పిల్లలను గాంచినపుడు కలుగు రసం,